క్లుప్తంగా

ముక్కంటి సేవలో హిమాచల్ ప్రదేశ్ సీఎం



ఆలయ ధ్వజస్తంభం వద్ద హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, గరికపాటి రమేష్‌బాబు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్య కల్యాణానికి ప్రదానం



ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న ఈఓ, భేరి వంశస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ అమ్మవారి తరపున భేరి వంశస్తులు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఈఓ సాగర్‌బాబుకు భేరి వంశస్తులు అమ్మవారి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

మునికృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న బైక్ యూనియన్‌నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలో మునికృష్ణ అనే ద్విచక్ర వాహన మెకానిక్ ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించాడు. దీంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కుటుంబపోషణ కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మేమున్నామంటూ శ్రీకాళహస్తి బైక్ మెకానిక్ యూనియన్ నాయకులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైక్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని సేవలో వైవీ స్వర్ణమ్మ



వేంకటేశ్వరస్వామి ఆలయలంలో వైవీ స్వర్ణమ్మ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి సేవలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి వైవీ స్వర్ణమ్మ పాల్గొన్నారు. టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె పేరిట అర్చనలు చేసి స్వామి అమ్మవార్ల కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రమాదకరమైన కొమ్మను తొలగించండి



రోడ్డుకు అనుకుని ఉన్న వేపచెట్టు కొమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రం సమీపంలోని శ్రీకాళహస్తి మార్గంలో కేటీరోడ్డు పక్కనే వేపచెట్టు కొమ్మ ప్రమాదకరంగా ఉందని, దీన్ని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. వేపచెట్టు కొమ్మలు రోడ్డుకు అడ్డుగా ఉండడంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చెట్టుకొమ్మ వాహనాలకు తగలడంతో ధ్వంసం అవుతున్నాయి. లోడ్డు వాహనాల్లోని సరుకులు దెబ్బతింటున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ కథనం మేరకు.. తిరుపతికి చెందిన సుకుమార్(34), వినోద్(39) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జ్ఞానప్రసూనాంబకు పూర్వీకుల సారె

- తిరుత్తణిలో స్థిరపడిన 3 వేల మంది అమ్మవారి వంశీకులు
- అమ్మవారి కల్యాణోత్సవానికి ఏటా ఉభయకర్తల వ్యవహరిస్తున్న వైనం



అమ్మవారికి సారెను తీసుకొస్తున్న తమిళనాడు రాష్ట్రం తిరుత్తణివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూన్నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని పరిణయ వేళ... అమ్మవారి వంశస్తులు ఆనవాయితీగా సారె సమర్పించి, అమ్మవారి తరపున కల్యాణోత్సవ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. సోమవారం కూడా తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో స్థిరపడిన సుమారు 300 మంది అమ్మవారి వంశస్తులు మంగళవాయిద్యాల నడుమ సారెను తీసుకొచ్చి సమర్పించారు. శెంగుందర్ కుల వెళ్లత్తూరు మరబినార్ సంఘం ఆధ్వర్యంలో తిరుత్తణి ఎస్‌జీవీ పురం గ్రామానికి చెందిన అమ్మవారి వంశ పూర్వీకులు కల్యాణ వేడుకలో సంప్రదాయంగా అమ్మవారి తరపున ప్రధాన ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో స్థిరపడిన వారు పూర్వకాలంలో అమ్మవారికి పూలు, నూనె సమర్పించే వారు. అయితే తమిళనాడు రాష్ట్రం విడిపోయాక, వీరంతా తిరుత్తణిలో స్థిరపడ్డారు. ఎస్‌ఎం సుబ్రమణ్యం అధ్యక్షుడిగా ఉన్న ఈ సంఘం తరపున మాంగాడు లోకనాథం, గురునాథం, నాగప్ప మొదలితో కూడిన బృందం తిరుత్తణి ఆర్‌కే పేటలో అమ్మవారికి ప్రతిరూపంగా వెలసిన వెళత్తూరు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి వీరు సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకున్నారు. ఆలయ ఈఓ సాగర్‌బాబుకు సారెను సమర్పించి కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా రూ.5లక్షలు చెల్లించారు.

బాల్య వివాహాల కట్టడికి విస్తృత తనిఖీలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరగనున్న స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవంలో బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు అధికార యంత్రంగం సోమవారం విస్తృత తనిఖీలు చేసింది. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిదుర్గ, డీఎస్పీ విశ్వనాథ్, సీఐ అంజూయాదవ్‌లతో కూడిన బృందాలు శ్రీకాళహస్తికి వచ్చే అన్ని మార్గాల్లో ప్రత్యేక టెంట్లు వేసి, కల్యాణో త్సవానికి వచ్చే జంటలకు సంబంధించి నిర్ణీత వయస్సు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నాయుడుపేట మార్గం నుంచి వచ్చే వారి కోసం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని కూడలి వద్ద, చెన్నై మార్గం, పిచ్చాటూరు మార్గం, తిరుపతి మార్గాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టారు. అలాగే పెళ్లిమండపం, నాలుగు మాడా వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు నాలుగు మాడా వీధుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు జరిపించడానికి ఎక్కడైనా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసి, కల్యాణోత్సవంలో బాల్య వివాహాల కట్టడికి చర్యలు చేపట్టారు.

ముక్కంటికి కాణిపాకం వినాయకుడి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు అందజేస్తున్న కాణిపాకం వినాయకస్వామి ఆలయ చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం వినాయకస్వామి ఆలయం తరపున పట్టువస్త్రాలను సోమవారం ఆ దేవస్థానం పాలక మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి దంపతులు, ఈఓ వెంకటేష్ దంపతులు సమర్పించారు. ముందుగా ఆలయ ఆవరణలోని మణికంఠేశ్వరాలయం నుంచి మంగళవాయిద్యాలు నడుమ బయలుదేరి ఆలయంలోని అలంకార మండపానికి చేరుకున్నారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబుకు పట్టువస్త్రాలను అందజేశారు. కాణిపాకం ఆలయ చైర్మన్, ఈఓలను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్, సతీష్‌మాలిక్, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన సోమవారం కంచనపుత్తూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారమే భోజనం పెట్టాలని, భోజన శాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళానీరాజనం..పులకరించిన భక్తజనం



గుంటూరుకి చెందిన యోగిని చంద్రకాళి ప్రసాద మాతాజీ, కాశీవన పీఠాధిపతి నంబూరు ప్రవచనం

- భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దూర్జటి కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సోమవారం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీదేవి, గుంటూరుకి చెందిన యోగిని చంద్రకాళి ప్రసాద మాతాజీ, కాశీవన పీఠాధిపతి నంబూరు ప్రవచనం, సహస్ర అవధాని మాడుగుల నాగఫణి శర్మ ప్రవచనం, సినీ నేపథ్యగాయకులు రాము బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు భక్తులను పులకరింపజేశాయి. ఇద్దరిని ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీకాళహస్తికి చెందిన వర్షారెడ్డి, ప్రత్యూష, హారిణి, లావణ్య, హైదరాబాద్‌కు చెందిన స్వాతిశ్రీ కల్చరల్ ట్రస్ట్ నృత్య ప్రదర్శనలు భక్తకోటి జనాన్ని అలరించాయి. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన శివనాథ నాటక కళామండలి మోహన్ బృందం ప్రదర్శించిన బాలనాగమ్మ, శ్రీకాళహస్తిలోని పీర్లచావడి ప్రాంతానికి చెందిన శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో రవిబాబు బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక నాటికలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పల్లంపేటలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని పల్లంపేటలో వెంకటాద్రి ఆర్‌ఎంపీ వైద్యుడిగా క్లినిక్ నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్య కాలనీకి చెందిన వెంకటేష్ నాయక్(53) తలనొప్పితో బాధపడుతూ చికిత్స కోసం ఆదివారం పల్లంపేటలోని వెంకటాద్రి క్లినిక్‌కు వెళ్లాడు. నొప్పి తగ్గడానికి వైద్యుడు వెంకటేష్ నాయక్ తల నుదుటి భాగంలో ఇంజక్షన్ చేశాడు. ఇంజక్షన్ వికటించడంతో నొప్పి ఎక్కువ కావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి వెంకటేష్ నాయక్ మృతి చెందాడు. మృతుడి భార్య లూమా ఫిర్యాదు మేరకు వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొత్తవీరాపురం సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ చంద్రమునిరణాల్

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఆర్‌డీఓ చంద్రమునిరణాల్ తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు శివయ్య, సిబ్బందితో చర్చించారు. ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించాలని, ఈ నెల 9వ తేదీనుండి మార్చి 16వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భవనాలపై పోస్టర్లను అతికించకూడదని, ప్రార్థనా మందిరాల వద్ద బహిరంగసభలు నిర్వహించకూడదని తెలిపారు. అధికారుల అనుమతితోనే సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. మండల కేంద్రం, గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ సమస్యలపై పరిష్కరించాలని, స్పందన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరాలయంలో విదేశీ భక్తుల సందడి



శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో విదేశీ భక్తులు



కళాకారులతో కలిసి కోలాట నృత్యం చేస్తున్న విదేశీ భక్తులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లిలోని శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు చివరి రోజున విదేశీ భక్తులు సందడి చేశారు. సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కళాకారుల బృందంతో కలిసి కోలాటం చేశారు. మన దేశ సంప్రదాయాల పట్ల వారికి ఉన్న ఆసక్తి, గౌరవం వారి ప్రవర్తనలో వెలుగుచూసింది.

కల్యాణ వైభోగమే..



భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న వేద పండితులు

వరదయ్యపాళెం: మండలంలోని జ్యోతినగర్‌లో వెలసిన శ్రీ జ్యోతీశ్వరాలయంలో కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి ముందుగా రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లలిత సహస్రనామం, పూజ కార్యక్రమాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలు, బంగారు అభరణాలు, సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి చెంత ఉంచిన మంగళసూత్రాన్ని భక్తులకు చూపి వేదమంత్రాల నడుమ అమ్మవారి మెడలో వేసి, కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పడగల నీడన ప్రసన్న వేంకటేశ్వరుడు



శేషవాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవారు



పోలీసు బందోబస్తు

శ్రీకాళహస్తి రూరల్: బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు పెద్ద శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి చతుర్మాడ వీధుల్లో విహరించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణాలు నడుమ ఊరేగింపు నయనానందకరంగా సాగింది. సోమవారం రాత్రి గ్రామోత్సవానికి 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని తొండమాన్‌పురంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంపై తొండమాన్‌పురం, తొండమనాడు గ్రామస్తులకు 2020 నుంచి వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. రెండు గ్రామాల మధ్య వివాదం చోటుచేసుకోవడంతో టీటీడీ అధికారులు గ్రామోత్సవం రద్దు చేశారు. ఆగమన శాస్త్రం ప్రకారం కేవలం తమ గ్రామంలోనే స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించాలని లేకపోతే గుడిలోపలే స్వామి అమ్మవార్లను ఊరేగించాలని టీటీడీ అధికారులకు తొండమాన్‌పురం గ్రామస్తులు ప్రతి ఏడాది వినతిపత్రం అందిస్తూ వచ్చారు. తొండమాన్‌పురం గ్రామంలో స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహిస్తే తమ గ్రామంలో కూడా గ్రామోత్సవం నిర్వహించాలని లేకపోతే ఆలయ లోపల గ్రామోత్సవం నిర్వహించటానికి ఎలాంటి ఇబ్బంది లేదని టీటీడీ అధికారులు దృష్టికి తొండమనాడు గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రూరల్ సీఐ అజయ్‌కుమార్ వారం రోజులు నుంచి రెండు గ్రామాల్లో పెద్ద మనుషులతో పంచాయితీ చేశారు. టీటీడీ అధికారుల నిర్ణయం మేరకు ఇరు గ్రామాల వాసులు నడుచుకోవాలని తేల్చి చెప్పారు. సోమవారం నిర్వహించిన శేషవాహన సేవ తొండమాన్‌పురంలోనే గ్రామోత్సవం నిర్వహించాలని టీటీడీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఎలాంటి వివాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా ధ్వజారోహణం

- వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురంలో ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మార్చి ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపైకి అధిరోహింపజేశారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలు 9 గంటలు మధ్య విశ్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగ హోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చిపై బ్రహ్మోత్సవ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

స్వీయరక్షణ నైపుణ్యాలు అవసరం



విద్యార్థికి షీల్డు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: సమాజంలో బాలికలకు చదువుతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలు అవసరమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. రేణిగుంట ఓల్డ్ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న ఇన్ఫాంట్ జీసెస్ స్కూల్‌లో విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ సుందరమూర్తి, దేవరాజులు ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు షీల్డులను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లడుతూ ఇక్కడ విద్యార్థులకు చదువుతోపాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే ఇలాంటి యాక్టివిటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు ఆపత్కాల సమయంలో ఒకరిపై ఆధారపడకుండా ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఆనంద్, ఫాదర్లు సుసైనాథన్, సైమన్ గుడిమి, మండల వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామికి పట్టువస్త్రాల అందజేత



పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న అంజూరు తారక శ్రీనివాసులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి అనుబంధ ఆలయం అయిన పెద్ద కన్నలిలో ఉన్న దుర్గాదేవి సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ నిర్వాహకులైన దశరథరామిరెడ్డి, రాజశేఖర్, విజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఆలయ పూజారితో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, బాలాగౌడ్, సునీల్, తేజ గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్షరయజ్ఞంలో సమిధనవుతా

- జై తెలుగు తల్లి డామ్ కామ్‌తో భాషాభివృద్ధికి బాటలు
- యువశ్రీ కలం పేరుతో సాహితీసేద్యం



తెలుగు భాష దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టరు బాలాజీ, డీఈఓ శేఖర్ చేతుల మీదుగా సత్కారం(ఫైల్)



జ్ఞాపికలతో యువశ్రీమురళి

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగు ఔన్నత్యాన్ని చాటేలా రచనలు చేస్తూ, భాషే శ్వాసగా, అలుపెరగని అక్షర పోరాటంతో భాషోద్యమం సాగిస్తున్నాడు. పరాయి భాష ఆధిపత్యం పెరిగి, మాతృభాష మసకబారుతున్న నేపథ్యంలో తెలుగు మాధుర్యాన్ని పంది మందికి పంచాలని భావించారు మురళి. తెలుగు కోసం చేసే అక్షర యజ్ఞంలో సమమిధనవుతానంటున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కనమనంబేడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, యాగమ్మ సంతానం యువశ్రీ మురళి. ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక ప్రాథమిక పాఠశాల, ఉన్నత విద్య బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్ శ్రీకాళహస్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో పూర్తిచేసి, ఎస్వీయూలో ఎంఏ పట్టా పొందారు. అనంతరం తెలుగు భాషా పండిత శిక్షణ పూర్తి చేసి 2003లో తెలుగు భాషా పండితుడిగా నియమితులయ్యారు. వివిధ ప్రాంతాల్లో పనిచేసి ప్రస్తుతం మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా పండితుడుగా పని చేస్తున్నారు. ఏళ్లుగా కవితలు రాయడం అలవాటు ఉన్న మురళి తన కవితలను యువశ్రీ కలం పేరిట రాస్తున్నారు.

తెలుగు కనపడాలి.. వినపడాలి

భాషాభివృద్ధికి తన వంతు కృషి చేయాలన్న ఆశయంతో ।తెలుగు కనపడాలి..తెలుగు వినపడాలి। అనే నినాదంతో జై తెలుగుతల్లి.కామ్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. తెలుగుభాష చరిత్ర, భాషాభివృద్ధికి కృషి చేసిన తెలుగు కవులు, రచయితలు, వారి చాయాచిత్రాలు, వారి జీవిత చరిత్ర వివరాలు, వివిధ శతక పద్య రత్నాలు, నీతికథలు, కవితలు, తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలైన పండుగలు, ప్రముఖ ఆదర్శ వ్యక్తుల సూక్తులు మొదలైనవి అందులో పొందుపరిచారు.

ఎన్నో ప్రశంసలు, పురస్కారాలు

2008లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సత్కారం, 2010లో చిత్తూరు కలెక్టరు శేషాద్రి చేతుల మీదుగా ఉగాది కవి సత్కారం, 2011లో ప్రపంచ తెలుగు రచయితల రెండవ మహాసభల్లో కవి సత్కారం, 2013లో చిత్తూరు కలెక్టరు సాల్మన్ ఆరోఖ్యరాజ్, 2015 అప్పటి మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ కవి పురస్కారాలను అందుకున్నారు. యూనివర్సల్ పీస్ సంస్థ వారి సామాజిక సేవారత్న, ఉత్తమ ఉపాధ్యాయ, తెలుగు భాషాశ్రీ, పురస్కారంతోపాటు అంబేడ్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డులు, రివార్డులు అందుకున్నారు.



జైతెలుగుతల్లి. డామ్ వెబ్‌సైట్